బదిలీల్లో ఉపాధ్యాయుల తప్పిదాలు

- విద్యాశాఖ పరిశీలనలో గుర్తింపు
- 17 మందికి తాఖీదులు



జులై 11న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

జిల్లాలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో పలువురు ఉపాధ్యాయుల తప్పిదాలు బయటపడ్డాయి. నిబంధనలను పాటించకుండా అధికారులను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించిన తీరు జిల్లా విద్యాశాఖ పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. స్పౌజ్ కేటగిరి కింద బదిలీల్లో పలువురు అడ్డదారుల్లో వారికి నచ్చిన పాఠశాలకు స్థానచలనం పొందారు. జూన్, జులై నెలల్లో జిల్లా విద్యాశాఖ నిర్వహించిన బదిలీల్లో జరిగిన ఈ వ్యవహారంపై 'ఈనాడు'లో జులై 11న 'ఉపాధ్యాయుల బదిలీలలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలన చేపట్టారు.

నిబంధనలకు విరుద్ధంగా...

భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే స్పౌజ్ కేటగిరి పాయింట్లను వాడుకుని నిబంధనల మేరకు బదిలీ స్థానాలను సూచించాలన్నది నిబంధన. భార్య ఈ పాయింట్లను ఉపయోగిస్తే భర్త పని చేసే మండలం సమీపానికి, భర్త ఉపయోగిస్తే భార్య పని చేసే సమీపానికి వెళ్లాలి. కానీ పలువురు ఈ నిబంధనలను తుంగలో తొక్కారు. ఆన్‌లైన్ ద్వారా బదిలీల ప్రక్రియను చేపట్టడంతో తప్పుడు విధానాలను అవలంబించారు. వారి నివాస ప్రాంతానికి సమీపంలో, రవాణా సదుపాయంగల బడులకు, కరీంనగర్‌కు సమీపంలోని పాఠశాలలకు బదిలీలు కోరుకున్నారు. అనుకున్న చోట పోస్టింగ్‌లు పొందారు. ఇలా స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారు. ఈ విషయం జిల్లా విద్యా శాఖ దృష్టికి వెళ్లడం, 'ఈనాడు'లో కథనం రావడంతో రంగంలోకి దిగిన జిల్లా విద్యాశాఖ అప్పట్లోనే 48 మంది ఇలా స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసినట్లు గుర్తించింది. వారి వివరాలను ఎంఈవోలతో పరిశీలనకు పంపించారు.

జిల్లా కేంద్రం సమీపంలోకి..

జిల్లాలోని 17 మంది ఉపాధ్యాయులు బదిలీల్లో స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసినట్లు జిల్లా విద్యాశాఖ పరిశీలనలో గుర్తించారు. ఇందులో ఎక్కువ మంది ఎస్జీటీలే ఉన్నారు. పలువురు ఇలా స్పౌజ్ కేటగిరి కింద అదనపు పాయింట్లు పొంది నిబంధనల ప్రకారం బదిలీ అయ్యే మండలాలను వదిలి కరీంనగర్ సమీప మండలాలకు బదిలీపై వచ్చినట్లు గుర్తించారు. 17 మందిని గుర్తించి షోకాజు నోటీసులు శుక్రవారం జారీ చేసినట్లు డీఈవో జనార్దన్‌రావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే పత్తికి మద్దతు ధర

జమ్మికుంట, న్యూస్‌టుడే: నాణ్యతా ప్రమాణాలున్న పత్తిని మద్దతు ధరకు ఖరీదు చేసేందుకు 148 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సీసీఐ వరంగల్ బ్రాంచి జీఎం అర్జున్ ఎస్ దావే తెలిపారు. శుక్రవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి నాణ్యతను పత్తి జిన్నింగ్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దొనకొండ మల్లారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. స్థానికంగా సీసీఐ నోటిపై చేసుకున్న జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేశారు. స్థానిక మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం, స్థానిక పత్తి వ్యాపారులతో సీసీఐ పత్తి కొనుగోలుపై ఆయన సమీక్షించారు. స్థానిక మార్కెట్ ద్వితీయ శ్రేణి కార్యదర్శి రాజా, పత్తి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త వీసీ ఎదుట సవాళ్లెన్నో!

శాతవాహన ఉపకులపతిగా ఉమేశ్‌కుమార్





ఈనాడు, కరీంనగర్

ఎట్టకేలకు శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఉపకులపతిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పని చేసిన ఉమేశ్‌కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించనుండగా.. ఆయనకు పలు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి..

ఈ ఏడాది మే 21వ తేదీన అప్పటి ఉప కులపతిగా ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ పదవీ కాలం ముగియడంతో ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వీసీ పోస్ట్ కోసం 158 మంది ఆచార్యులు దరఖాస్తు చేసుకోగా ఎట్టకేలకు ఇక్కడి విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి వీసీగా ఉమేశ్‌కుమార్‌ను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు వెలువరించింది. 2008లో విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటినుంచి ఇప్పటి వరకు ముగ్గురే పూర్తిస్థాయి వీసీలుగా పనిచేశారు. మొదటి ఉప కులపతిగా మహ్మద్ ఇక్బాల్ అలీ, 2012లో కడారు వీరారెడ్డి, 2021లో ఎస్.మల్లేశ్ రెగ్యులర్ వీసీలుగా కొనసాగారు.

రిజిస్ట్రార్‌గా రెండేళ్లు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉమేశ్‌కుమార్ రసాయన శాస్త్ర ఆచార్యుడిగా పలు చోట్ల సేవలు అందించారు. 2018- 2020 మధ్య శాతవాహన విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పని చేశారు. ఆ పదవికి వన్నెతెచ్చే విధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకున్నారు. ఆయన హయాంలోనే స్నాతకోత్సవం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అదే మొదటి.. చివరి స్నాతకోత్సవం కావడం గమనార్హం. రహదారులు, వసతి గృహాల నిర్మాణాలు, అంబులెన్స్ ఏర్పాటు, ఏటీఎం సదుపాయాలు విద్యార్థులకు కల్పించారు. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా, ఇన్‌ఛార్జి వీసీగానూ ఈయన పనిచేశారు.

వీటిపై దృష్టి పెడితేనే..

గడిచిన కొన్నేళ్లుగా విశ్వవిద్యాలయంలో నిధుల దుర్వినియోగం, అవినీతిపై ఆరోపణలు విపరీతంగా వచ్చాయి. ఇటీవల ఇక్కడి వ్యవహారంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు కూడా చేపట్టారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ, అవినీతికి ఆస్కారం లేకుండా సంస్కరణలకు, మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టాలి. మరో వసతి గృహ భవనం నిర్మిస్తే ఇరుకిరుకుగా ఉండాల్సిన అవసరం తప్పుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకున్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చడం, కొత్త పోస్టులను మంజూరు చేయించడం, ఖాళీలు లేకుండా చూడటంలాంటి చర్యలతో ముందుకు సాగాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. ఇవన్నీ పక్కాగా ఉంటేనే న్యాక్ గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే 12బీ హోదా ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో నిధులను రాబట్టడంపై కొత్త వీసీ దృష్టి పెట్టాలి. మారుతున్న కాలంతోపాటు కొత్త కోర్సుల ఆవశ్యకతను గుర్తించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుని అందించాలి.

దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, న్యూస్‌టుడే: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరంలో 9వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రధానాచార్యులు పి.మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ఈనెల 30వ తేదీ చివరి గడువని పేర్కొన్నారు. నవోదయ విద్యాలయ వెబ్‌సైట్‌లో అంతరాయం కారణంగా cbseitms.nic.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అకాల వర్షం.. నేలవాలిన పంట



గంగాధర మండలంలో రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు చోట్ల కోత దశలో ఉన్న వరిపంటకు నష్టం వాటిల్లింది. పంట కోసి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించగా వర్షాలకు తడిసి ముద్దవుతుందని రైతులు ఆందోళన చెందారు. పత్తి పంట చేలోనే తడిసి మొలకలు వస్తున్నాయని వాపోతున్నారు. కొండన్నపల్లిలో నేలకొరిగిన వరి పైరు ఇది. పంటల నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గంగాధర

అతివల సమస్యల పరిష్కారానికి శుక్రవారం సభ



నాగుల మల్యాల పాఠశాలలో పిల్లాడికి ఉగ్గు తినిపిస్తోన్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: మహిళల సమస్యలన్నింటికీ శుక్రవారం సభ పరిష్కార వేదికగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం నాగుల మల్యాల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన శుక్రవారం సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి మహిళా, గర్భిణి, బాలింత శుక్రవారం సభకు తప్పక హాజరుకావాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు సభకు హాజరవుతారని, మహిళల సమస్యకు అప్పటికప్పుడే పరిష్కారం లభిస్తుందన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా 50 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో సంజీవ్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఓ చంటి పిల్లాడికి ఉగ్గు తినిపించి, మహిళలకు చీర, గాజులు, పండ్లు, పువ్వులు అందించారు.

పాఠశాల పనులపై ఆరా

కరీంనగర్ కలెక్టరేట్ : జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు డిసెంబరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎంఈవోలు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద పాఠశాలల్లో నిర్మించే వంట గదులు, ప్రహరీ, మరుగుదొడ్లు పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. నిర్మాణ పనులను శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, పంచాయతీ రాజ్ ఈఈ చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్స్ పరీక్షలపై సమీక్ష

కరీంనగర్ కలెక్టరేట్ : జిల్లాలో గ్రూప్-2, 3 పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. అదనపు కలెక్టర్, ఆర్డీవో అందరూ సమన్వయం చేసుకుంటున్నారని, జిల్లాలో 56 కేంద్రాలను గుర్తించామని, సుమారు 27,712 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

కళాభారతి ఆధునికీకరణకు ప్రతిపాదనలు..

కార్పొరేషన్: నగర పాలక కార్యాలయ ఆవరణలో ఉన్న కళాభారతిని ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా పాలనాధికారి పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కళాభారతిని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏళ్లుగా కళాకారులకు సేవలందించిన కళాభారతిని అత్యుత్తమగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీటింగ్, విద్యుత్తు, గ్రీన్ రూమ్, లైటింగ్ వంటి సాంకేతిక వ్యవస్థతో కల్పించేందుకు నిపుణులతో చర్చిస్తామన్నారు. అతి త్వరలోనే పనులు ప్రారంభించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ అజయ్ యాదవ్, అదనపు కమిషనర్ సువార్త, డీఈఈ అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం దాటని మహిళా శక్తి

వెనుకబడిన అధికారులకు నోటీసులు ■ నెలాఖరులోగా పూర్తయ్యేనా?

న్యూస్‌టుడే, కరీంనగర్ సుభాష్‌నగర్

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి స్వశక్తి సంఘాల మహిళలను కోటీశ్వరులను చేసేలా కార్యాచరణ తీసుకోగా.. క్షేత్రస్థాయిలో లక్ష్యం దాటని పరిస్థితి నెలకొంది. ఇటీవల రాష్ట్ర స్థాయిలో దృశ్యమాధ్యమ సదస్సు నిర్వహించి ఆరా తీయగా అన్ని పురపాలికల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉండటంతో అధికారులను అప్రమత్తం చేశారు.

జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి పురపాలికలు ఉన్నాయి. వీటి పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో 6,498 స్వశక్తి సంఘాలు పని చేస్తున్నాయి. ఇప్పటికే బ్యాంకు లింకేజీ, వ్యక్తిగత రుణాలు, స్త్రీనిధి, పీఎం స్వనిధి వంటి రుణాలు అందిస్తుండగా తాజాగా ఎంపిక సంఘాల్లో ఇందిరా మహిళాశక్తి కింద వ్యక్తిగత, గ్రూపు రుణాలు ఇచ్చి వీరిని ఆర్థికాభివృద్ధి సాధించేలా ముందుకు తీసుకెళ్లేందుకు పురపాలికల వారీగా లక్ష్యాన్ని విధించారు. నెలాఖరులోగా పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేశారు.

ఇన్‌ఛార్జి పర్యవేక్షణతో జాప్యం

జిల్లా మెప్మా పథక సంచాలకులు కొన్ని రోజుల కిందట బదిలీపై వెళ్లగా ఆ పోస్టు ఖాళీగానే ఉంది. నగరపాలక సంస్థలో పని చేస్తున్న డిప్యూటీ కమిషనర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. బల్దియాలోనే రెవెన్యూ, పరిపాలన, ఇతర విభాగాలతోనే సరిపోతుండగా అదనంగా ఇచ్చిన పీడీ బాధ్యతలపై అంతంతా మాత్రంగానే పర్యవేక్షణ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి మహిళా సంఘాలతో మమేకం అవుతూ యూనిట్లు పెరిగేలా చూడాల్సి ఉంటుంది. ఇటీవల పెరిగిన పని భారంతో అధికారులు, ఉద్యోగులు కార్యాలయాలకే పరిమితం అవుతుండటం, కింది స్థాయిలో ఒత్తిడి పెంచడం తప్ప ఆశించిన ప్రగతి మాత్రం కనిపించడంలేదనే విషయం పెండింగ్ యూనిట్లు పరిశీలిస్తే తెలుస్తోంది. అదనపు బాధ్యతలు లేకుండా పూర్తి స్థాయిలో పథక సంచాలకులు ఉన్నట్లేయితే కార్యకలాపాల్లో జాప్యం లేకుండా సాఫీగా సాగుతాయని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే నాలుగు పురపాలికల కమిషనర్లకు, మెప్మా ఉద్యోగులందరికీ అదనపు కలెక్టర్, నగరపాలిక కమిషనర్ వేర్వేరుగా తాఖీదులు ఇచ్చి సంజాయిషీ కోరడం చర్చనీయాంశంగా మారింది.

మహిళాశక్తి రుణాల లక్ష్యం వివరాలు..

నగర/పురపాలిక	వ్యక్తిగత రుణాలు		సామూహికం	
	లక్ష్యం	ఏర్పాటు	లక్ష్యం	ఏర్పాటు
కరీంనగర్	316	78	53	4
హుజూరాబాద్	38	6	7	0
జమ్మికుంట	51	10	9	0
చొప్పదండి	27	6	4	0
కొత్తపల్లి	18	5	2	0

ముందుకు రాని మగువలు

రుణాలు తీసుకొని వ్యక్తిగత అవసరాలకు వాడుకునేందుకు ఆసక్తి చూపిస్తున్న మహిళలు, ఆ రుణాలతో యూనిట్లు స్థాపించాలని కోరుతున్నా పెద్దగా ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది. రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న మెప్మా ఉద్యోగులు వెళ్లి వివరిస్తుండగా పట్టించుకోవడం లేదంటున్నారు. ఏ యూనిట్ నెలకొల్పిన ఇద్దరు, ముగ్గురు తప్పనిసరిగా పని చేయాల్సి ఉంటుందనే ఆలోచనలతో వెనకడుగు వేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికే కొందరు ముందుకొచ్చి వ్యాపారాలు చేస్తుండగా వారి తరహాలో యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా బలోపేతమయ్యేలా మరింత ప్రోత్సహించాల్సిన అవసరముంది.

వీటికే ప్రాధాన్యం

■ వ్యక్తిగత విభాగంలో పరిశీలిస్తే.. కూరగాయలు, పండ్ల విక్రయాలు, పాల ఉత్పత్తులు, టెంట్ హౌస్, మైకు సౌండ్ సిస్టం సెంటర్లు, బ్యూటీపార్లర్, వెల్‌నెస్ సెంటర్లు, ఫ్యాన్సీ స్టోర్స్, కిరాణ జనరల్ దుకాణాలు, సారీ రోలింగ్, డ్రై క్లీనింగ్, ఫుడ్ ట్రక్స్, ఇంట్లో తయారు చేసిన వస్తువులను విక్రయించేలా బహిరంగ దుకాణాలు.

■ సామూహిక సంఘాలలో క్యాంటీన్లు, మీసేవా కేంద్రాలు, ఈవెంట్ నిర్వహణ, వీధి వ్యాపారులకు శీతల నిల్వ కేంద్రాలు, క్యాటరింగ్, ఆహార శుద్ధి కేంద్రాలు, భవన నిర్మాణ సామగ్రి వంటివి ఉన్నాయి.

బాలురలో గంగాధర.. బాలికల్లో కరీంనగర్

వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు


విజేతగా నిలిచిన గంగాధర బాలుర జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు


కరీంనగర్ అర్బన్ బాలికల జట్టు..

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి బి.వేణుగోపాల్ అన్నారు. కరీంనగర్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ స్టేడియంలో శుక్రవారం జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలబాలికల అండర్-14 వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని 16 మండలాల నుంచి సుమారు 320 మంది బాలబాలికలు హాజరయ్యారు. బాలుర విభాగంలో గంగాధర, బాలికల విభాగంలో కరీంనగర్ అర్బన్ జట్లు విజేతలుగా నిలిచాయి. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను కరీంనగర్ జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు గిన్నె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

హద్దులు నిర్ణయిస్తాం

తిమ్మాపూర్: రామకృష్ణకాలనీకి చెందిన అనంత పద్మనాభ స్వామి ఆలయ భూములకు సంబంధించిన హద్దులను 15 రోజుల్లోగా నిర్ణయిస్తామని దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ సుప్రియ తెలిపారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు శుక్రవారం దేవాదాయ శాఖ, సర్వే అధికారులు సంయుక్తంగా ఆలయ భూములను కొలిచారు. కొన్నేళ్లుగా ఆలయ భూములపై కోర్టులో ఉన్న వివాదం సమసిపోగా, ఈ భూములకు సంబంధించి హద్దులు నిర్ణయించకపోవడంతో స్థానికంగా సమస్యలు వస్తున్నాయి. దీంతో రెండు శాఖల అధికారులు ఆలయ భూములను పరిశీలించారు. సహాయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో మరోసారి సమయం తీసుకుని హద్దులు నిర్ణయిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఎవరి పాపం!

శిశువు మృతదేహంపై విచారణ


ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్ చంద్రశేఖర్

న్యూస్‌టుడే, హుజూరాబాద్ గ్రామీణం

సుమారు ఆరేడు నెలల వయసులోనే ఆ పాపకు నూరేళ్లు నిండాయి. ఎవరి పాపమో తేల్చేపనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. హుజూరాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో క్యాజువాలిటీ విభాగం పక్కన ఉన్న మరుగుదొడ్డిలో గురువారం రాత్రి ఆడ శిశువు మృతదేహాన్ని గుర్తించిన విషయం విదితమే. ఈ ఘటనపై విధుల్లో ఉన్న వైద్యుడు రమేశ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కనుకయ్య, సీఐ తిరుమల్‌గౌడ్, సిబ్బంది ఆసుపత్రిని పరిశీలించారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలకు తరలించారు. ఫోరెన్సిక్ వైద్య నిపుణులతో శవ పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై కలెక్టర్ పమేలా సత్పతి విచారణకు ఆదేశించారు. కరీంనగర్ డీసీహెచ్ చంద్రశేఖర్ ఆసుపత్రికి చేరుకొని సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో సుధాకర్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందును పలు వివరాలు అడిగి తెలుసుకొన్నారు. సిబ్బందితో విడివిడిగా మాట్లాడారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు డీసీహెచ్ వెల్లడించారు.

అన్నీ అనుమానాలే..!

గురువారం రాత్రి ఆసుపత్రిలో వైద్యుడితోపాటు సిబ్బంది విధుల్లో ఉన్నారు. రాత్రి 9.30 గంటలకు మరుగుదొడ్డిలో శిశువు మృతదేహం ఉందని వైద్యుడికి సమాచారం అందింది. దీన్నిబట్టి ముందుగానే శిశువు మృతదేహాన్ని విడిచివెళ్లారని తెలుస్తోంది. క్యాజువాలిటీ విభాగం వద్ద సెక్యూరిటీతో పాటు ఇతర విభాగాల్లో పని చేసే సిబ్బంది ఉన్నారు. ఆ సిబ్బంది సహకారం లేకుండా శిశువును ఎలా తీసుకొస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. క్యాజువాలిటీ విభాగం ముందు డ్యూటీ వైద్యుడి గది, మరోవైపు మరుగుదొడ్డి ఉన్నాయి. అటువైపు నిఘా నేత్రాలు లేవనే విషయం ఆసుపత్రి సిబ్బందికి తెలుసు. ఆసుపత్రి సిబ్బంది సహకారంతోనే ఉంటారనే అనుమానాలు తలెత్తుతున్నాయి. మరోవైపు ఆసుపత్రిలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఒక మహిళ, పురుషుడిని అనుమానిస్తున్నారు. వారు ఎందుకు వచ్చారు, ఎటు వెళ్లారు తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

హుజూరాబాద్ కేంద్రంగా మూడో ఘటన

■ హుజూరాబాద్ పరిధిలో ఆరు నెలల వ్యవధిలో ఇటు వంటి ఘటనలు మూడు చోటు చేసుకున్నాయి.

■ ఆరు నెలల క్రితం ఆడ శిశువు మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రయాణ ప్రాంగణం సమీపంలోని మూత్రశాలల వద్ద పడేశారు.

■ సెప్టెంబర్ 12న హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి శివారులోని కాకతీయ ప్రధాన కాలువ వద్ద ఓ మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు మూటలో కట్టేసి విసిరేశారు. ఆ సమయంలో అటుగా ఉన్న ఓ రైతు పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన పోలీసులు అక్కడికి చేరుకొని శిశువును ఆసుపత్రికి తరలించి కాపాడారు.

■ తాజాగా మరో ఆడ శిశువు మృతదేహం ప్రభుత్వాసుపత్రి మరుగుదొడ్డిలో లభ్యమైంది. హుజూరాబాద్ డివిజన్‌లో ఎక్కడో గర్భవిచ్ఛిత్తి చేసి ఇక్కడికి తీసుకొచ్చారనేది వైద్యులు, పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వలస జీవుల ఆరోగ్యంతో వైద్య కేంద్రాల చెలగాటం

● ఏజెంట్లు, ల్యాబ్ నిర్వాహకుల దందా
● టీకాలు వికటించి ఆసుపత్రి పాలవుతున్న వైనం

ఈనాడు, సిరిసిల్ల

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకు సగటున 300 నుంచి 500 మంది ఇతర దేశాలకు వలస వెళ్తుంటారు. ఎలాంటి రుగ్మతలు లేకుంటేనే ఆయా దేశాలు వీసాలు మంజూరు చేస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులు లేవని నిర్ధారించుకోవడంతోపాటు ఆయా దేశాలు సూచించిన టీకాలు తీసుకోవాలి. వీటిని ధ్రువీకరించాక వీసా మంజూరవుతుంది. హైదరాబాద్ నారాయణగూడలోని ప్రభుత్వ ఐపీఎం (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్), జీఏఎంసీఏ (గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ అప్రూవ్ మెడికల్ సెంటర్స్ అసోసియేషన్) కేంద్రాల్లో వైద్య పరీక్షలు, టీకాలు ఇస్తారు. ఐపీఎంలో రూ.30 చెల్లించి తమ వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. అందులో సూచించిన సమయానికి వెళ్తే ఉచితంగా టీకా ఇస్తారు. ఇక్కడ 26 రకాల టీకాలు అందుబాటులో ఉంటాయి. ఇక జీఏఎంసీఏలో ఒక్కరికి రూ.7,500 ఫీజు చెల్లించాలి.

✦ దుబాయ్, సౌదీ, ఒమన్, కువైట్, సింగపూర్, మలేషియా, ఆఫ్గానిస్థాన్ తదితర దేశాలకు వెళ్లేవారు వైద్య పరీక్షలు, టీకాలపై అవగాహన లేక పూర్తిగా ఏజెంట్లను నమ్ముతారు. వారు అడిగినంత ఇచ్చి మోసపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా కనీసం వెయ్యి మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ లెక్కన నెలలో లక్షల రూపాయలు వైద్య పరీక్షల పేరిట వ్యాపారం జరుగుతోంది. వాస్తవంగా ఈ తరహా వైద్య పరీక్షలన్నీ ప్రభుత్వ ఐపీఎం కేంద్రంలో రూ.30 స్లాట్‌తో అయిపోతాయి. వీటిపై అవగాహన లేని వలస జీవులు వేలాది రూపాయలు నష్టపోతున్నారు.

ఉపాధి బాటలో గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి బలహీనతల్ని ఆసరాగా చేసుకుని వైద్య పరీక్షలు, టీకాల పేరిట కొందరు ఏజెంట్లు దండుకుంటున్నారు. ఎక్కువ కమీషన్‌కు ఆశ పడి అనుమతి లేని కేంద్రాల్లో పరీక్షలు చేయిస్తున్నారు. అక్కడ సరైన నిబంధనలు పాటించక టీకాలు వికటించి అనారోగ్యం బారిన పడుతున్నారు. లక్షలాది రూపాయలు ఏజెంట్లకు ముట్టజెప్పి, పొరుగు దేశాలకు వెళ్లిన వారు అక్కడ పని చేయలేని స్థితిలో ఇంటిబాట పడుతున్నారు. డబ్బులు పోయి, అనారోగ్యంతో ఉపాధి లేక వలస జీవులు అవస్థలు పడుతున్నారు.

✦ హైదరాబాద్‌లోని ఐపీఎంతోపాటు జీఏఎంసీఏ అనుమతి ఉన్నవి ఎనిమిది కేంద్రాలు ఉన్నాయి. అనుమతి లేని మెహదీపట్నం, హిమాయత్‌నగర్, చార్మినార్, పాతబస్తీ ప్రాంతాల్లో చాలా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో టీకాలు ఇచ్చేవారి చేతులు, సూది మందు ఇచ్చే ప్రాంతంలో చర్మాన్ని శుభ్రం చేయాలి. చర్మం పొరలోనే సూది మందు ఇవ్వాలి. కాని అపరిశుభ్రతతో చొక్కా పైనుంచి సూది ఇవ్వడం, అదీ చర్మం లోపలికి వేయడంతో కొన్ని రోజులకు సూది వేసిన చోట ఇన్‌ఫెక్షన్ ఏర్పడుతుంది. ఉమ్మడి జిల్లాలో జగిత్యాల, వేములవాడ, కరీంనగర్‌లలో ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్న వారు రోజు రోజుకు పెరుగుతున్నారు.



డబ్బులు ఖర్చయ్యాయి.. ఉపాధికి దూరమయ్యా..

- కారెంగుల రంజిత్‌కుమార్, సంగెం, కోరుట్ల మండలం

నేను కోరుట్లలో టైల్స్ నిర్మాణంలో పని చేస్తున్నాను. బహ్రెయిన్ వెళ్లేందుకు మెట్‌పల్లిలోని ఏజెంటుకు వీసా కోసం రూ.40 వేలు, వైద్య పరీక్షలకు రూ.7,200 చెల్లించాను. హైదరాబాద్ మెహదీపట్నంలోని ఎస్కే మెడికల్స్‌లో జూన్ 28న వెళ్లి వైద్య పరీక్షలు, టీకా చేయించుకున్నాను. పదిహేను రోజులకు టీకా వేసిన ప్రాంతంలో వాపుతోపాటు నొప్పి ఎక్కువైంది. స్థానిక వైద్యులను సంప్రదిస్తే, పరీక్షలు చేసి టీకా వికటించిందని శస్త్రచికిత్స చేశారు. పది రోజులకు తిరిగి నొప్పి రావడంతో రెండోసారి శస్త్రచికిత్స చేశారు. ఇప్పటికీ రూ.30 వేల పైనే ఖర్చయింది. వీసా వచ్చినా గడువు ముగియడంతో వెళ్లలేకపోయాను. టీకా ఇచ్చిన కేంద్రంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను.

కంపెనీకి డబ్బులు చెల్లించి ఇంటికి వచ్చా

- పోతుగంటి చంద్రశేఖర్, సంగెం, కోరుట్ల మండలం




ఆరు నెలల క్రితం ముంబయి ఏజెంటు సాయంతో క్లీనింగ్ సూపర్‌వైజర్ పని మీద సౌదీ వెళ్లాను. అక్కడికి వెళ్లిన రెండు నెలలకు టీకా తీసుకున్న ప్రాంతంలో నొప్పి రావడంతో అక్కడి వైద్యులను సంప్రదించాను. టీకా వికటించింది సర్జరీ చేయాలని సూచించారు. కంపెనీ వారు వేతనం ఇవ్వలేదు. నా దగ్గర చికిత్సకు డబ్బులు లేవు. కంపెనీకి అదనపు డబ్బులు చెల్లించి వచ్చాను. ఇప్పటికీ రెండు శస్త్రచికిత్సలు అయ్యాయి. మొత్తంగా రూ.4 లక్షలు ఖర్చయ్యాయి. ప్రాణాలతో చెలగాటమాడుతున్న టీకా కేంద్రంపై చర్యలు తీసుకోవాలి.

పత్తి విక్రయాలకు సాంకేతిక దన్ను

న్యూస్‌టుడే, జమ్మికుంట

మద్దతు ధరకు పత్తి విక్రయించడంలో రైతులు ఇబ్బందులు పడకుండా మార్కెటింగ్ శాఖ సమాచారాన్ని అందించేందుకు సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాట్సాప్ అప్లికేషన్‌తో ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలు విధానాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేలా చర్యలు తీసుకుంది. దీంతో సీసీఐ కేంద్రానికి వచ్చిన సమయం, పత్తి ఖరీదు, డబ్బుల చెల్లింపు ఏ స్థాయిలో ఉందనే సమాచారం తెలియనుంది. మార్కెటింగ్ శాఖ తాజా చర్యతో రైతులు సీసీఐ కేంద్రాలున్న జిన్నింగ్ మిల్లుల్లో విక్రయానికి నిరీక్షించే అవసరం ఉండదు. ఏ కేంద్రంలో ఎంత పత్తి ఉంది? అక్కడ పత్తిని విక్రయించేందుకు ఎంత సమయం పడుతుందనే వివరాలను రైతులు ముందస్తుగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. సీసీఐకి పత్తిని విక్రయించే రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు.



వాట్సాప్‌లో పత్తి రైతుకు కనిపించే వివరాలు

రైతులు ఏం చేయాలంటే..

✦ సీసీఐకి పత్తి విక్రయానికి సంబంధించిన సెల్ నంబర్ 8897 281111ను సేవ్ చేసుకోవాలి.

✦ ఆ నంబర్ వాట్సాప్‌లో 'హెచ్‌ఐ' అని టైపు చేయాలి.

✦ వెంటనే 'వన్ సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో యాప్ ఓపెన్ అవుతుంది.

✦ ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషలు కనిపిస్తాయి.

✦ కావాల్సిన భాషను ఎంపిక చేసుకోవాలి.

✦ భాషను ఎంపిక చేసుకోగానే పత్తి విక్రయ సమాచారం, తక్‌పట్టి వివరాలు, కొనుగోలు కేంద్రంలో వేచి ఉండే సమయం వంటి వివరాలు కనిపిస్తాయి.

✦ పత్తి విక్రయానికి సంబంధించి రైతు వివరాలు.. ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు.. ఎన్ని క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేయగలదు వంటి వివరాలు తెలుస్తాయి.





పసిడి భానుడు.. వెన్నెల రేడు

నీలి మేఘాల మధ్య నుంచి భానుడి లేలేత కిరణాలతో పచ్చటి పంటలు పసిడి వర్ణాన్ని అద్దుకోగా చుట్టూ ఆకాశం ఎరుపు రంగులో తళుకులీనుతోంది. నీకు నేను పోటీ అంటూ పున్నమి చంద్రుడు ఎదురుగా వెన్నెల కాంతులు కురిపించాడు. శుక్రవారం తెల్లవారుజామున కమాన్‌పూర్ మండలం గుండారం పంచాయతీ రాజాపూర్ వద్ద పంట పొలాల్లో ఈ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి.

-న్యూస్‌టుడే, కమాన్‌పూర్

చోటు కోసం పోటాపోటీ!

● పల్లెల్లో 'ఇందిరమ్మ కమిటీ'ల కలవరం

ఈనాడు, కరీంనగర్

స్థానిక సంస్థల ఎన్నికల విషయం పక్కకు వెళ్లి.. ప్రస్తుతం పల్లెల్లో ఇందిరమ్మ కమిటీల్లో చోటు కోసం చర్చ జరుగుతోంది. 'నాకంటే.. నాకు' అవకాశమివ్వాలన్న విజ్ఞప్తులు పెరుగుతుండటంతో అధికార పార్టీ నాయకులకూ తలనొప్పి వ్యవహారంగా మారింది. నాలుగు జిల్లాల పరిధిలో ఊరూరా కమిటీలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. అన్ని జిల్లాల కలెక్టర్ల చేతికి చేరిన ఈ ప్రతిపాదనలను ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించిన తరువాత అధికారికంగా ప్రకటిస్తారు. కానీ చాలా గ్రామాల్లో ఇందులో చోటు దక్కించుకునేందుకు చోటామోటా నాయకులు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేశారు. కొన్ని చోట్ల ఏకాభిప్రాయాలతో సభ్యుల పేర్లు వెళ్లినప్పటికీ ఇంకొన్ని చోట్ల మాత్రం సీనియర్లు, జూనియర్లనే తారతమ్యంతో రెండు, మూడు జాబితాలు ఉన్నతాధికారులకు అందాయి.

ఆగమేఘాల మీద..

ఈ నెల 11వ తేదీన ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19 నాటికి ఎంపిక పూర్తి చేయాల్సి ఉండటంతో క్షేత్రస్థాయిలో కసరత్తు జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలనలోనూ ఉమ్మడి జిల్లాలో 7,18,756 మంది అర్జీలు అందించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 చొప్పున 12 నియోజకవర్గాలకు 42 వేలు మంజూరు చేసింది. సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలిచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు.

ఏడుగురికి అవకాశం!

ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్‌గా గ్రామ సర్పంచి, కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి వ్యవహరిస్తారు. ప్రత్యేకాధికారుల పాలన ఉండటంతో ప్రస్తుతం ఛైర్మన్‌గా ప్రత్యేకాధికారి ఉంటారు. పుర, నగరపాలికల్లో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ ఛైర్మన్‌గా ఉండనున్నారు. కన్వీనర్‌గా వార్డు అధికారికి చోటిస్తారు. వీరు కాకుండా కమిటీలో మరో అయిదుగురు స్థానికుల్ని తీసుకుంటారు. ఇందులో ఇద్దరు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతోపాటు గ్రామాభివృద్ధిపై ఆసక్తి ఉన్న మరో ముగ్గురితో కమిటీని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఆ ముగ్గురిలో ఒకరు బీసీ మరొకరు ఎస్సీ లేదా ఎస్టీ సామాజిక వర్గాల నుంచి తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో చాలా గ్రామాల్లో ఈ పార్టీకి చెందిన వారే ఈ కమిటీల్లో చోటు కోసం పోటీపడ్డారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో కమిటీలది కీలకపాత్ర కావడం, తరువాత పథకంలో లోపాలేమైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తూ లబ్ధిదారులకు అధికారులకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరించే అవకాశం కావడంతో చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు.

వివాదం తప్పదా!

ఎంపికకు ముందే అటు కాంగ్రెస్ ఇటు భారాస నాయకుల మధ్య అక్కడక్కడా వివాదం మొదలైంది. హుజూరాబాద్‌లో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన నియోజకవర్గ పరిధిలోని చాలా గ్రామాల నుంచి ఈ కమిటీల్లో పలువురికి చోటివ్వాలని ప్రతిపాదనలు ఎంపీడీవోలకు అందించారు. భారాస ఎమ్మెల్యేలున్న కరీంనగర్, కోరుట్ల, సిరిసిల్ల నియోజకవర్గాల్లో ఇదే తరహాలో ప్రతిపాదనలు పలు కమిటీల విషయంలో అందాయి. ముఖ్యంగా పురపాలిక, నగరపాలక సంస్థల్లో భారాస కార్పొరేటర్లు ఎక్కువగా ఉన్నారు. వారు పేర్లు ఇస్తుండగా అటు కాంగ్రెస్ వారు కూడా పోటీగా మరో ప్రతిపాదనను ఇస్తుండటంతో ఏది తుది జాబితాగా మార్చాలనే సందిగ్ధంలో అధికారులుంటున్నారు. ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తరువాత అసలు కమిటీల్లో ఎవరుంటారనేది తేలనుంది.

23 నుంచి 26 వరకు డీఈఈసెట్ వెబ్ ఆప్షన్లు

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (డీఈఈసెట్)-2024 ఉత్తీర్ణులై, ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు డీ.ఎల్.ఎడ్./డీపీఎస్ఈ మొదటి సంవత్సరంలో చేరడానికి ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని ఎల్ఎండీ కాలనీ డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాం మొండయ్య తెలిపారు. ఇప్పటి వరకు ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోలేకపోయిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు ఈ నెల 21న తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని డైట్ కళాశాలలో పరిశీలన చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు డీఈఈసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెరిగిన పత్తి విక్రయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి విక్రయాలు పెరుగుతున్నాయి. యార్డుకు శుక్రవారం 174 ట్రాలీల కొత్త విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. సీజన్ ఆరంభం నుంచి ఎక్కువ పత్తి విక్రయానికి రావటం ఇదే ప్రథమని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇతర మార్కెట్లలో పత్తి విక్రయాలు మొదలు కాలేదు. జమ్మికుంట మార్కెట్‌లో గత నెల 18 నుంచి కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. శుక్రవారం ట్రాలీల వారీగా బిడ్డింగ్ నిర్వహించారు. కొత్త విడిపత్తికి కనిష్ఠంగా రూ.6,000 నుంచి రూ.7,000 వరకు ధర పలికింది. 38 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా క్వింటాకు రూ.6,000 నుంచి రూ.6,500 వరకు వ్యాపారులు ఖరీదు చేశారు. గురువారం కంటే తాజాగా ధర రూ.50 తగ్గింది. స్థానిక ద్వితీయ శ్రేణి వ్యాపారులతోపాటు ఇద్దరు జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు పత్తిని ఖరీదు చేయగా.. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శులు ఆర్.మల్లేశం, రాజాలు పరిశీలించారు.

స్వయం ఉపాధికి చేయూత

ఎస్‌బీఐ ఆర్‌సెటిలో కంప్యూటర్ ట్యాలీపై ఉచిత శిక్షణ

న్యూస్‌టుడే, తిమ్మాపూర్

గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులకు ఎస్‌బీఐ ఆర్‌సెటి అండగా నిలుస్తోంది. అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించడంతోపాటు వ్యాపార సాధన నైపుణ్యాలను పెంపొందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఈ ఉచిత శిక్షణ ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

30 రోజులపాటు..

- కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్‌లో 2010 సంవత్సరంలో నెలకొల్పిన ఎస్‌బీఐ ఆర్‌సెటి (గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ)లో ఈ నెల 23 నుంచి కంప్యూటర్ ట్యాలీ కోర్సుపై 30 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభమవుతుంది.
- ఆసక్తి గల ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల (18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన) పురుషులు ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లతో ఈ నెల 22వ తేదీ లోపు సంస్థలో సంప్రదించాలి.
- కంప్యూటర్ ట్యాలీ కోర్సుకు 30 రోజుల వరకు శిక్షణ తరగతులు ఉంటాయి.
- శిక్షణ కాలంలో ఉచిత భోజనంతోపాటు ఉచిత వసతిని అందిస్తారు.



మహాత్మానగర్‌లోని ఎస్‌బీఐ ఆర్‌సెటి సంస్థ

యువత సద్వినియోగం చేసుకోవాలి

- డి.సంపత్, సంస్థ డైరెక్టర్

సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించడంతోపాటు నైపుణ్యాలను మెరుగుపర్చేలా కృషి చేస్తున్నాం. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ అనంతరం ధ్రువపత్రాన్ని అందజేయడంతోపాటు వ్యాపార రంగానికి సంబంధించిన రుణాన్ని బ్యాంకు ద్వారా అందజేస్తున్నాం.

వరద కాలువకు నీటి విడుదల

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ జలాశయం నుంచి వరదకాలువకు శుక్రవారం 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఈ నీటిని మధ్యమానేరు జలాశయానికి తరలించనున్నారు. ప్రాజెక్టులోకి 23,826 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా స్పిల్‌వే గేట్లద్వారా 6,248 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 5,800, ఇతర కాలువలు, మిషన్ భగీరథ, ఎత్తిపోతలు కలుపుకుని మొత్తం ఇన్‌ఫ్లోకు సమానంగా ఔట్‌ఫ్లోను కొనసాగిస్తూ ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటిని నిల్వచేస్తున్నారు.



హెడ్‌రెగ్యులేటర్ నుంచి వరదకాలువకు విడుదలవుతున్న నీరు

తేలికపాటి వర్షసూచన.. ఉమ్మడి జిల్లాలో రాగల అయిదురోజుల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు పొలాస పరిశోధనస్థానం ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. వర్షసూచన ఉన్నందున రైతులు తమ పంట ఉత్పత్తులను కాపాడుకోవాలన్నారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 23-24 డిగ్రీలు, గరిష్ఠంగా 32 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వివరించారు.

వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ వీసీల నియామకంపై హర్షం

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీగా డాక్టర్ అల్దాస్ జానయ్య, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీగా డాక్టర్ దండ రాజిరెడ్డిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన దండ రాజిరెడ్డి గతంలో జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానంలో శాస్త్రవేత్తగా పనిచేయగా అల్దాస్ జానయ్య జగిత్యాల పొలాస వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా పనిచేశారు. ఉమ్మడి జిల్లాతో అనుబంధంగల ఇద్దరు వ్యక్తులు రెండు వర్సిటీలకు వీసీలుగా నియమితులు కావటంపై సాగురంగానికి మేలు కలిగిస్తుందని ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతిభట్, డాక్టర్ మంజులత, డాక్టర్ శ్రీధర్‌సిద్ధి, వెల్మల రాంరెడ్డి, వంగల వెంకటరెడ్డి పేర్కొన్నారు.

చిన్నారులకూ ఏకరూప దుస్తులు

న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీకి సిద్ధం

పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసే ఏకరూప దుస్తులను ఇక నుంచి అంగన్‌వాడీ పిల్లలకూ అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిట్టి, పొట్టి చిన్నారులు ఇక నుంచి ఏకరూప దుస్తుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో సందడి చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తరహాలో అంగన్‌వాడీ చిన్నారులు కనిపించనున్నారు. ప్రభుత్వం వస్త్రాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రాలకు అందజేసింది. ఈ వస్త్రంతో మహిళా సంఘ సభ్యులు ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తి చేశారు. కొన్ని రోజుల్లో చిన్నారులకు అందజేస్తారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలు ఇలా..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
జగిత్యాల	1065	63,835
కరీంనగర్	777	43,736
సిరిసిల్ల	587	34,376
పెద్దపల్లి	706	35,112

మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు..

చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించటంతోపాటు ఆటపాటలతో ప్రాథమిక విద్య నేర్పించటానికే మూడు దశాబ్దాల క్రితం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పడ్డాయి. ఇప్పటివరకు చిన్నారులు వివిధ రకాల దుస్తులు ధరించి అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారికి ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇక నుంచి వారు ఏకరూప దుస్తులు ధరించి అంగన్‌వాడీలకు రావాల్సి ఉంటుంది. బాలురకు చొక్కా, నెక్కరు, బాలికలకు గౌను ఆకర్షణీయంగా డిజైన్ చేయటంతో అదే తరహాల్లో దర్జీలు కుడుతున్నారు. ఒక్కో జత కుట్టేందుకు రూ.80 నుంచి రూ.100 వరకు ప్రభుత్వం వారికి చెల్లిస్తుంది. దర్జీ పనులు ఇప్పటి వరకు 99 శాతం పూర్తయ్యాయి. జిల్లా ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు పంపిణీ చేయనున్నారు.



చిన్నారుల దుస్తుల నమూనా

మంచి డిజైన్లతో కుట్టాం

మాకు అప్పగించిన వస్త్రాలను చిన్నారుల కొలతలకు తగినట్లుగా, వివిధ రకాల డిజైన్లతో షర్టులు, నెక్కర్లు, గౌన్లు కుట్టాం. నాణ్యత ప్రమాణాలు పాటించాం. మాకు అప్పగించిన వస్త్రాన్ని మొత్తం కుట్టడం పూర్తి చేసి సంబంధిత శాఖకు అప్పగించాం.

- దీప్తి, స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు, కరీంనగర్

త్వరలోనే పంపిణీ

చిన్నారులకు ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తయింది. త్వరలోనే కలెక్టర్, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా వాటిని పంపిణీ చేయనున్నాం. దుస్తుల పంపిణీతో కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య సైతం పెరుగుతుందని ఆశిస్తున్నాం. మొదట 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల వయసుగల చిన్నారులకు పంపిణీ చేయనున్నాం.

- సరస్వతి, జిల్లా సంక్షేమాధికారి, కరీంనగర్

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
కరీంనగర్ - 8008573500
గంగాధర - 8008573508
మానకొండూర్- 8008573527
కరీంనగర్ గ్రామీణ- 8008573536
హుజూరాబాద్ -8008573513

కార్పొరేషన్: నాకా చౌరస్తా నుంచి అశోక్‌నగర్ వైపు వెళ్లే దారిలో నడి రోడ్డుపై ఉన్న చాంబర్ మూత పగిలి ప్రమాదకరంగా ఉంది? **- హుస్సేన్**
సమాధానం: పరిశీలిస్తాం. **- ఇంజినీరింగ్ అధికారి, నగరపాలిక**

సుభాష్‌నగర్: రాంనగర్ ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర డ్రైనేజీ కోసం రోడ్డు తవ్వడంతో గుంతలు పడింది? **- తిరుపతిరావు**
సమాధానం: పూడ్చేస్తాం. **- ఇంజినీరింగ్ అధికారి, నగరపాలిక**

మానకొండూర్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానం వద్ద వీధి దీపాలు లేకపోవడంతో వ్యాయామానికి ఇబ్బందిగా ఉంటోంది. **- సత్యం**
సమాధానం: పరిశీలించి దీపాలను ఏర్పాటు చేయిస్తాం.
- రేవంత్, పంచాయతీ కార్యదర్శి

హుజూరాబాద్ గ్రామీణం: స్థానిక రోడ్ల డివైడర్ మధ్యలో ఉన్న కోనో కార్పస్ మొక్కలను తొలగించాలి. **- నాగరాజు, హుజూరాబాద్**
సమాధానం: తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తాం.
- సల్వాది సమ్మయ్య, పుర కమిషనర్

జమ్మికుంట: ఆర్వోబీ వంతెన కింద, వాహనాలు మళ్లే మలుపుల వద్ద వ్యాపారాలు చేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- శ్రీనివాస్**
సమాధానం: వ్యాపారాలు చేసే వారిని సీజ్‌తో కలిసి గుర్తిస్తాం.
- ఆయాజ్, పుర కమిషనర్

చొప్పదండి: పురపాలక సంఘం పరిధిలోని బీసీకాలనీలో చెత్తాచెదారం పేరుకుపోయింది? **- రాజు**
సమాధానం: సిబ్బందిని పంపి చెత్త సేకరించేలా చర్యలు తీసుకుంటాం. **- ఎన్నం అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

వీధిదీపానికి మరమ్మతులు

వందనం

సుభాష్‌నగర్: నగరంలోని వావిలాలపల్లి గుండు హనుమాన్ టెంపుల్ వెనుకాల విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపానికి మరమ్మతులు చేశారు. ఈనెల 18న 'మేమున్నాం..మీకుతోడుగా..'లో వచ్చిన సమస్యకు వీధిదీపాల పర్యవేక్షకుడు స్పందించారు. క్షేత్రసాయిలో పరిశీలించి కొత్తది బిగించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల ఉత్సాహం.. ప్రతిభకు ప్రోత్సాహం




'ఈనాడు' ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులు వై.సంవేద్య, జి.ఆకృతి, కె.సౌమ్యరెడ్డిలకు విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ ఎం.అరుణకుమారి, వైస్ ప్రిన్సిపల్ కె.సత్యగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – ఈనాడు, కరీంనగర్ విద్యావిభాగం

అసంపూర్తిగా మురుగుకాలువ



మంకమ్మతోటలోని పలు వీధుల్లో శిథిలమైన మురుగుకాలువల స్థానంలో కొత్తగా భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టారు. ఇంటింటా కనెక్షన్లు ఇవ్వగా వాటిని కనిపించకుండా రోడ్డు నిర్మించాల్సి ఉంది. కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయకపోవడంతో పలు వీధుల్లో భూగర్భ ఛాంబర్లు వెక్కిరించేలా తయారయ్యాయి. ఇళ్ల ముందు రాకపోకలు సాగించకుండా మారిందని, వెంటనే ఆ పనులు పూర్తి చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కార్పొరేషన్

రహదారిపై గుంతలు పూడ్చేదెప్పుడు?



హుజూరాబాద్- సైదాపూర్ ప్రధాన రహదారిలోని బోర్నపల్లి వద్ద ఏర్పడిన గుంతలతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిపై హుజూరాబాద్, సైదాపూర్, హుస్నాబాద్ వైపు ప్రతీరోజు ఆర్టీసీ బస్సులు, కార్లు, లారీలు, ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో వెళ్తుంటాయి. వర్షాలు పడితే నీటితో నిండిన గుంతలు కనబడక ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారని, అధికారులు మరమ్మతు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, హుజూరాబాద్

సూర్యనగర్‌లో తాగునీటికి ఇబ్బందులు



నగరంలోని సూర్యనగర్‌లో కుళాయి నీటికి ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామీణ మిషన్ భగీరథ కింద వేసిన పైపులైను ద్వారా నీరు సక్రమంగా రావడంలేదు. ఇక్కడే కాకుండా చుట్టూ ఉన్న కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సుభాష్‌నగర్**

లక్ష్మీనగర్‌లో నిలిచిన రహదారి పనులు



నగరంలోని లక్ష్మీనగర్‌లోని పలు వీధులలో ముఖ్యమంత్రి హామీ నిధులతో నిర్మించే రహదారి పనులు నిలిచిపోయాయి. గత పది నెలలుగా రాకపోకలు సాగించే స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒక వైపు ఎత్తుగా వరద కాలువ పైకప్పు నిర్మించగా, మరో వైపు రహదారి తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. వెంటనే రోడ్డు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సుభాష్‌నగర్**

నాణ్యత లేని పనులకు కాంగ్రెస్‌దా బాధ్యత?

సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: గతేడాది నిర్మించిన తీగల వంతెన, కూడళ్ల పనులను నాసిరకంగా, నాణ్యత లేకుండా చేపట్టడంతో అక్కడ గుంతలు పడి దారుణంగా మారిందనే విషయాన్ని గుర్తించకుండా దీనికి కాంగ్రెస్ పార్టీ ఎలా బాధ్యత వహిస్తుందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బల్దియాలో అవినీతి అక్రమాలపై విచారణ చేయాలని భారాస నగర అధ్యక్షుడే ఆరోపణలు చేస్తున్నారని, తమ పార్టీ కూడా విచారణ జరగాలని కోరుతుందన్నారు. కోర్టు ఆదేశాల మేరకే మేయర్‌పై కేసు నమోదు చేస్తే కాంగ్రెస్ చేయించిందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమాలపై విచారణ చేయాలని కోరుతూ కలెక్టర్, సీపీకి లేఖ అందించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి బాధ్యత వహించే ఎమ్మెల్యే ప్రజలకు ఎందుకు అందుబాటులో ఉండటం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా భారాస నగర అధ్యక్షుడు మాట్లాడిన వీడియో, పత్రికల వార్తలను ప్రదర్శించారు. నాయకులు తాజుద్దీన్, అరుణ్‌కుమార్, శ్రావణ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, రమేశ్, శిరీష్, పోచయ్య, వెంకట్‌రెడ్డి, షబాన, కవిత, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వ్యాఖ్యలు బాధాకరం'

తెలంగాణచౌక్ (కరీంనగర్) : కాంగ్రెస్ పార్టీ భారాస నేతలపై కేసులు పెడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో ప్రెస్‌భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ను కావాలనే బద్నాం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేటర్లు, నాయకులు కాశెట్టి శ్రీనివాస్, చాడగొండ బుచ్చిరెడ్డి, గంట కళ్యాణి, మెండి శ్రీలత, ఆకుల నర్సయ్య, సరిళ్ల ప్రసాద్, భూమాగౌడ్, ఆకుల ప్రకాష్, నేతికుంట యాదయ్య, మల్లికార్జున రాజేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం



గంగిపల్లిలో గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, తిమ్మాపూర్, న్యూస్‌టుడే: రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. గంగిపల్లిలో 150 మెట్రిక్ టన్నుల ఎరువుల గోదాంను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అర్హులందరికి త్వరలోనే రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. సింగిల్ విండో అధ్యక్షులు గోవిందరెడ్డి, తహసీల్దార్ రాజేశ్వరి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు. ఎల్ఎండీ కాలనీలోని మహిళా శిశు వికాస కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. మరమ్మతు పనులను పరిశీలించారు. వసతి గృహ ఏర్పాటు అంచనాలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యా, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక ఇంజినీర్ అనితా సింగ్నాథ్, సీనియర్ అసిస్టెంట్ సుధ, అకౌంటెంట్ రాజా కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బాలయ్యపల్లి పరిధి సాయబ్‌పల్లికి చెందిన ఎంబీఏ విద్యార్థిని కామెర సమత ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ప్రథమ సంవత్సరం ఫీజు మొత్తాన్ని చెక్ రూపంలో ఎమ్మెల్యే అందజేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

సంక్షిప్తం

హుజూరాబాద్ గ్రామీణం: వచ్చే నెల 3న హైదరాబాద్‌లో జరిగే ధర్మసమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు తాళ్ల నరేశ్ కోరారు. శుక్రవారం హుజూరాబాద్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. బాబు, రవి, సురేష్, సందీప్, రవితేజ పాల్గొన్నారు.

కరీంనగర్ కొత్తపల్లి: పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానికంగా పీడీఎస్‌యూ వసంత మేఘగర్జన సభ గోడప్రతులను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ మాట్లాడుతూ.. ఈ నెల 21న ఓయూలో, 25న కేయూలో జరిగే విజయోత్సవ సభలను విజయవంతం చేయాలని కోరారు. రాజేశ్, రాజ్‌కుమార్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరి

శంకరపట్నం: చిన్నారులు, బాలింతలకు పోషకాహారం తప్పనిసరిగా అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి అన్నారు. కొత్తగట్టు, కన్నాపూర్ గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి నాగార్జున, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకర్, వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు- నియామకాలు

గన్నేరువరం: గన్నేరువరంలో కౌండిన్య వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని పురుషోత్తం కిషన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. 108 మందికి 99 మంది ఓటును వినియోగించుకున్నారు. అధ్యక్షుడి బరిలో బుర్ర తిరుపతి గౌడ్, బుర్ర లక్ష్మీరాజం బరిలో నిలవగా.. బుర్ర తిరుపతి 52 ఓట్లతో విజేతగా నిలిచారు. ఉపాధ్యక్షుడిగా తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా మల్లేష్ నియమితులయ్యారు.

గన్నేరువరం: తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గన్నేరువరం మండలం జంగపల్లికి చెందిన అనుమాండ్ల కిషోర్ నియమితులయ్యారు.

మానకొండూర్: ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మానకొండూర్ సహకార సంఘం సీఈవో పి. లక్ష్మారెడ్డి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గంగాధర : రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా గంగాధర మండలం తాడిజెర్రికి చెందిన ఏరు గోపాల్‌రెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. పేద రెడ్ల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని గోపాల్‌రెడ్డి తెలిపారు.

విడుదల చేయాలి

తెలంగాణచౌక్ (కరీంనగర్): ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఇతర బకాయిలను విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగర కార్యదర్శి బామండ్ల నందు, జోనల్ ఇన్‌ఛార్జులు అనిల్, విష్ణు, విఘ్నేష్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ గ్రామీణం: ఉపకార వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అభావిప నగర హాస్టల్స్ సమన్వయకర్త అభిలాశ్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యం చూపుతుందన్నారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

జమ్మికుంట: జమ్మికుంటలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కరీంనగర్ మెప్మా పీడీ స్వరూపారాణి శుక్రవారం ప్రారంభించారు. శ్రీలక్ష్మి-1 సమాఖ్యలోని సభ్యురాళ్లు గ్రూప్‌గా క్యాంటీన్ ఏర్పాటు చేసుకోవటం అభినందనీయమన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ దేశిని స్వప్న, పుర మేనేజర్ రాజిరెడ్డి, సీఎల్ఆర్పీలు నాయకులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

కరీంనగర్ విద్యావిభాగం: స్థానిక బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ నోడల్ అధికారి వెంకట పద్మావతి ఆధ్వర్యంలో సీపీఆర్, ప్రథమ చికిత్సలపై అవగాహన సదస్సును నిర్వహించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి జగన్‌మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్స్ నిర్మల, సత్యవర్ధన్ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకట రాజిరెడ్డి పాల్గొన్నారు.

జమ్మికుంట: అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమని పద్మపాణి సొసైటీ వర్కర్ భోగం రాజు అన్నారు. ఇల్లందకుంట మండలం సిరిసేడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. ఏఎన్ఎం సత్య, బాలశౌరీ, హెచ్ఎం జగదీశ్ పాల్గొన్నారు.

వ్యాపారులకు జరిమానా

కార్పొరేషన్: రోడ్డుపై చెత్తాచెదారం పడేస్తున్న పూల వ్యాపారులకు శానిటేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జరిమానా విధించింది. శుక్రవారం ఉదయం రాజీవ్‌చౌక్, బాలికల కళాశాల రోడ్డులో తనిఖీలు చేశారు. మొత్తం 13 దుకాణాలకు రూ. 12 వేల జరిమానా వేసినట్లు పర్యావరణ ఇంజినీరు స్వామి తెలిపారు.

గ్రామ సభలు

కరీంనగర్ గ్రామీణం: గ్రామాల్లో ఉపాధి హామీ పనుల గుర్తింపునకు శుక్రవారం ఎలబోతారం, చామనపల్లిలో గ్రామ సభలు నిర్వహించి గ్రామస్థుల నుంచి ప్రతిపాదనలు సేకరించారు. ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఏపీవో శోభారాణి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిల్లర నాణేల వినియోగంపై ప్రచారం

రామడుగు : చిల్లర నాణేలు వ్యాపార లావాదేవీల్లో చెలామణి చేయాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్యాంకు మేనేజర్ జయశ్రీ ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం రామడుగులో ప్రచారం చేశారు. కొందరు రూ.10 నాణేలను తీసుకోవడం లేదని బ్యాంకు క్యాషియర్ రాకేష్ వివరించారు.

మండల పూజా మహోత్సవం

కరీంనగర్ సాంస్కృతికం : శాతవాహన విశ్వవిద్యాలయం సమీపంలోని శ్రీరాంనగర్‌కాలనీ శ్రీరామ మందిర ప్రతిష్ఠోత్సవ జరిగి 40 రోజులు పూర్తయిన సందర్భంగా వేద పండితులు జగన్నాథాచార్యుల బృందం వైదికత్వంలో మండల పూజా మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు దన్నమనేని మాధవరావు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై సదస్సు

కరీంనగర్ విద్యావిభాగం: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక సైన్స్ మ్యూజియంలో విద్యార్థులకు 'కృత్రిమ మేధస్సు- సంభావ్యత ఆందోళన' అంశంపై సెమినార్ నిర్వహించారు. విద్యార్థి భువన కృతిని రాష్ట్ర స్థాయి సెమినార్‌కు ఎంపిక చేశారు. జిల్లా సైన్స్ అధికారి సి. హెచ్. జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: ఉప విద్యుత్తు కేంద్రాల్లో మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈలు శ్రీనివాస్‌గౌడ్, ఎం.లావణ్య, రఘుపతిలు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు సంతోశ్‌నగర్, భాగ్యనగర్, మహాశక్తి దేవాలయం, విద్యాగనర్, ఆదిత్యనగర్, జ్యోతినగర్, విజయదుర్గ కాలనీ, న్యూ లేబర్ అడ్డా, పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, కురమ్మవాడ, వినాయకనగర్, శ్రీనగర్‌కాలనీ, పీటీసీ, మార్కండేయ కాలనీ, ప్రగతినగర్, పాత లేబర్ అడ్డా, సిద్ధార్థ పాఠశాల ప్రాంతం, వాసర ఆసుపత్రి ప్రాంతం, పారమిత పాఠశాల, లారెల్ పాఠశాల ప్రాంతం, చింతకుంట, రేకుర్తి, శాతవాహన విశ్వవిద్యాలయం ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొత్తపల్లి, చర్లబూత్కూర్, బొమ్మకల్, నగునూర్, ముగ్దుంపూర్ ప్రాంతాల్లో.. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అంబేడ్కర్ నగర్, వావిలాపల్లి, ఇందిరానగర్, రామాలయం ఏరియా, జ్యోతినగర్, శివ థియేటర్ ప్రాంతం, క్రిస్టియన్ కాలనీ, కోర్టు ప్రాంతం, బ్యాంకు కాలనీ, తేజ పాఠశాల, రెడ్డిఫంక్షన్ హాల్, వివేకానంద కళాశాల ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిగురుమామిడి: చిగురుమామిడి, ముల్కనూర్, రేకొండ విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మరమ్మతుల దృష్ట్యా విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈఈ ప్రకాశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువతి మృతి



రమ్య

రామడుగు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన యువతి శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన అలువాల రమ్య ఈనెల 13న తన భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా మ్యాకవెంకయ్యపల్లి వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. భార్యభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించడంతో మృతదేహాన్ని గోపాల్‌రావుపేటకు తరలించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరైన అంత్యక్రియలు నిర్వహించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

తిమ్మాపూర్: అలుగునూరు శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రహదారి నిర్మాణ కూలీలు భూక్య రాజు (గౌరెల్లి కొండాపూర్), వాగ్య (దూల్మిట్ట మండలం కూటిగల్ తండా)లు తీవ్రంగా గాయపడినట్లు ఎల్ఎండీ పోలీసులు తెలిపారు. హైదరాబాద్ వైపు వెళ్తున్న గ్రానైట్ లారీ బ్రేక్ లైనర్లు పట్టుకోవడంతో రోడ్డుపైనే ఆగిపోయింది. గమనించక ట్రాలీ వాహనం లారీని వెనక నుంచి ఢీకొట్టడంతో ట్రాలీలోని ఇద్దరు కూలీలూ తీవ్రంగా గాయపడగా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తీరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

శంకరపట్నం: తాడికల్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కోడూరి యాదగిరి నడిచి వెళ్తుండగా ఓ ట్రాలీ ఆటో ఢీ కొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు.

62 వాహనాలకు జరిమానా

కరీంనగర్ నేరవార్తలు: ట్రాఫిక్ నిబంధనలు పాటించని 62 వాహనాలకు ఈ-చలాన్ ద్వారా శుక్రవారం జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. నగరంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు.

బార్ సిబ్బందిపై దాడి.. అరెస్టు

కరీంనగర్ నేరవార్తలు: బార్ సిబ్బందిపై దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపిన ప్రకారం... కరీంనగర్ శనివారం అంగడి ప్రాంతంలోని ఓ మద్యం బార్‌లో కౌంటర్‌పై ఉన్న వ్యక్తిని పప్పు నరేష్ బెదిరించడంతోపాటు దాడి చేశాడు. బార్ నిర్వాహకుల ఫిర్యాదుపై మేరకు నరేష్‌పై కేసు నమోదు చేసి, జైలుకు పంపించారు.

శునకాన్ని చంపిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ నేరవార్తలు: కరీంనగర్ టవర్‌సర్కిల్ మార్కెట్ ప్రాంతంలో అజీజ్ ఓ కుక్కను ఇనుప రాడ్‌తో కొట్టి చంపడాన్ని స్థానికులు సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. జంతు సంరక్షణ కమిటీ కార్యకర్త గౌతం పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. కేంద్ర మాజీ మంత్రి, బ్లూక్రాస్ సంస్థ వ్యవస్థాపకురాలు మనేకాగాంధీ కరీంనగర్ పోలీసు అధికారులతో మాట్లాడటంతో అజీజ్‌పై కేసు నమోదు చేశారు.

కొండగట్టులో చిన్నారుల గుర్తింపు

మల్యాల: మానకొండూరు బీసీ సంక్షేమ వసతి భవనం నుంచి పారిపోయిన ఇద్దరు విద్యార్థులను ఔట్‌పోస్టు ఏఎస్సై రమణారెడ్డి కొండగట్టు స్టేజి వద్ద పట్టుకున్నారు. మానకొండూరు నుంచి పోలీసు సిబ్బంది కొండగట్టుకు చేరుకొని ఇద్దరు విద్యార్థులను తీసుకువెళ్లినట్లు ఏఎస్సై వివరించారు.

మహిళపై కేసు నమోదు

గన్నేరువరం: చొప్పదండి గురుకులంలో సీటు ఇప్పిస్తానని రూ.75 వేలు తీసుకొన్న మైలారానికి చెందిన రజినిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

కవల పిల్లలకు రక్తదానం



రక్తం ఇస్తున్న మహేందర్‌రెడ్డి

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: 12 రోజుల కవల పిల్లలకు బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, భాజపా నేత బేతి మహేందర్‌రెడ్డి అరుదైన ఓ నెగటివ్ రక్తం ఇచ్చారు. జగిత్యాల జిల్లా మల్యాలకు చెందిన అనుమల్ల రాజేందర్ దంపతులకు ఇద్దరు కవల పిల్లలు జన్మించారు. వారిద్దరు రక్తహీనతతో నగరంలోని స్టార్ పిల్లల దవాఖానాలో చికిత్స పొందుతుండగా 'ఓ' నెగెటివ్ రక్తం అత్యవసరమైంది. బాధితులు భాజపా అనుబంధ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కల్యాణ్‌ను సంప్రదించగా ఈ విషయాన్ని బేతి మహేందర్‌రెడ్డికి తెలిపారు. ఆయన ఆసుపత్రిలో రక్తదానం చేశారు.

సరిహద్దు భద్రతా దళానికి ఎంపిక

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న మాసిపెద్ది సుప్రీత స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్)నకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డి.వరలక్ష్మి ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సుప్రీతను కళాశాల ఆచార్యులు శ్రీనివాస్, రజనీ, కల్పన, అఫ్సర్‌ఉస్మాని తదితరులు అభినందించారు.

అధ్యాపకులకు కార్యశాల



ఆచార్యులు తిరుపతికి పుష్పగుచ్ఛమిచ్చి అభినందిస్తున్న ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో నైపుణ్యాలకు పదును పెడితే ఉన్నతంగా రాణించగలుగుతారని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్ డా. కె. రామకృష్ణ అన్నారు. శుక్రవారం కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీంస్, పాలసిస్, ఐక్యూ ఏసీ సంయుక్తంగా కళాశాల అధ్యాపకులకు కార్యశాల నిర్వహించారు. కార్యక్రమ కోఆర్డినేటర్‌గా సురభికాక్ వ్యవహరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు పి.నితిన్, టి.రాజయ్య, ఐక్యూ ఏసీ సభ్యులు డా.కరుణాకర్, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి



బూర్గుపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, న్యూస్‌టుడే: గ్రామాల్లో వరి కోతలు మొదలైనా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. గంగాధర మండలం బూర్గుపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించి వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం తూకం వేయాలని కోరారు. సన్న ధాన్యంతోపాటు దొడ్డు రకం ధాన్యానికి బోనస్ రూ.500 చెల్లించాలని డిమాండు చేశారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు అంచనా వేసి పరిహారం చెల్లించాలని కోరారు. భారాస మండలాధ్యక్షుడు నవీన్ రావు, మహిపాల్‌రావు, శంకర్‌గౌడ్ ఆయన వెంట ఉన్నారు.

మానకొండూర్ : రైతులు ధాన్యాన్ని ఆరబెడుతూ ఇబ్బందులు పడుతున్నారని. . వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే సింగిల్ విండో అధ్యక్షులను ఇబ్బందులకు గురి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. 20న తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో జరిగే 'అలయ్ బలయ్'ను విజయవంతం చేయాలని కోరారు. భారాస జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు వేణు, భారాస మండల అధ్యక్షులు శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి అన్నారు. కేశవపట్నంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. నాయకులు వెల్మారెడ్డి రాజిరెడ్డి, వాసుదేవ్, చక్రపాణి, తిరుపతి పాల్గొన్నారు.



సాధించిన పతకాలతో క్రీడాకారులు

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ

చొప్పదండి, న్యూస్‌టుడే: మండలంలోని రుక్మాపూర్ గురుకుల సైనిక పాఠశాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో సత్తాచాటారు. హైదరాబాద్‌లో జరిగిన ఎస్జీఎఫ్ పాఠశాల క్రీడల్లో అండర్-19 రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ చాటి విజయకుమార్, సిద్ధార్థ రెండు రజత, నరసింహ, రాజరథన్, దినేష్ మూడు కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. వారిని పాఠశాల డైరెక్టర్ కె.సి.రావు, ప్రధానాచార్యులు కాళహస్తి, పీడీలు ఇనాక్, వంశీకృష్ణ అభినందించారు. హిమ్‌రాజ్, మంజిత్‌లు అండర్-17 విభాగంలో జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

విలువిద్యలో అక్కాచెల్లెళ్లకు పతకాలు



హరిణి, హర్షిత

కరీంనగర్ క్రీడా విభాగం : హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి విలువిద్య విభాగంలో గన్నేరువరం మండలం జంగపెల్లికి చెందిన అక్కాచెల్లెళ్లు ప్రతిభ చాటారు. తాడూరి హరిణి రజత.. హర్షిత కాంస్య పతకాలు సాధించారు.

ఎన్ఎస్ఎస్ అధికారికి అభినందన

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కరీంనగర్ ఎస్సారార్ కళాశాల వృక్షశాస్త్ర ఆచార్యులు పడాల తిరుపతి జాతీయ సాహస శిబిరం కాంటినెంట్ లీడర్‌గా నియామకమైనందున ప్రిన్సిపల్ డా.రామకృష్ణ అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఈనెల 22 నుంచి 31 వరకు జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. వైస్‌ప్రిన్సిపల్ పి.నితిన్, టి.రాజయ్య, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు ఎలిజబెత్‌రాణి, కాంపెల్లి అర్జున్, బి.రాజేశ్, రాపర్తిశ్రీనివాస్, మామిడిపల్లి సత్యప్రకాశ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో 17 మంది నియామకం



డీఈవో జనార్దన్‌రావు నుంచి నియామక పత్రాలు పొందిన టీచర్లు

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్టీ, సీఆర్టీ, పీఈటీ పోస్టులను జిల్లా విద్యాశాఖ శుక్రవారం భర్తీ చేసింది. ఒప్పంద పద్ధతిలో 17 మందిని నియమిస్తూ నియామక ఉత్తర్వులను డీఈవో జనార్దన్‌రావు అందించారు. 2023లో కేజీబీవీల్లో పోస్టుల కోసం నిర్వహించిన రాత పరీక్ష ఆధారంగా మెరిట్ జాబితాలోని అర్హులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జీఈసీవో డాక్టర్ డెబోర కృపారాణి, జిల్లా సంక్షేమాధికారి సరస్వతిలు పాల్గొన్నారు.